# బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- బతుకమ్మ పాటలతో పర్యావరణ, నీటి సంరక్షణపై అవగాహన కల్పించాలి.
- రాష్ట్ర పర్యాటక ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్, వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్లు.


మనం





నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం । 14 । అక్టోబర్ । 2026 పేజీలు: 7





కామారెడ్డి, అక్టోబరు 13(మనం న్యూస్): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అలాగే జిల్లాల్లో చేపట్టిన పర్యాటక అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో బతుకమ్మ వేడుకల ఏర్పాట్లు, పర్యాటక ప్రాజెక్టుల పురోగతిపై ఆమె సమీక్షించారు. కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి సమావేశంలో పాల్గొన్నారు.

2

## సీఎం రేవంత్ రెడ్డితో నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ నేతల భేటీ

జిల్లా రాజకీయాలు, పార్టీ బలోపేతంపై చర్చ

2





## సిరికొండ పోలీస్ స్టేషన్ను తనిఖీ చేసిన నూతన సీఐ ఎస్. రామన్

శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

రోడ్లపై ధాన్యం ఆరబెడితే కేసులు నమోదు చేస్తాం: సీఐ హెచ్చరిక

3

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 13 (మనం న్యూస్): ధర్పల్లి సర్కిల్ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన ఎస్. రామన్ సిరికొండ పోలీస్ స్టేషన్ను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లోని రికార్డులు, కేసుల వివరాలు, సిబ్బంది విధులు, శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించిన అంశాలను పరిశీలించి, పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

# అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు

మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలు, నృత్యాలతో మార్మోగిన జుక్కల్!



బిచ్కుంద అక్టోబర్ 13, మనం న్యూస్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమైన బతుకమ్మ పండుగ జుక్కల్ నియోజకవర్గంలో అంగరంగ వైభవంగా జరిగింది. జుక్కల్ మండల కేంద్రంలోని గుండూరు రోడ్డులో మంగళవారం నిర్వహించిన ఎల్ కె ఆర్ బతుకమ్మ సంబరాలు-2026 మహిళల సందడి, బతుకమ్మ పాటలు, సంప్రదాయ నృత్యాలు, ఉత్సాహభరిత వాతావరణం మధ్య ఘన విజయాన్ని సాధించాయి.

2

# బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించాలి: వాణీ ప్రసాద్

**- బతుకమ్మ పాటలతో పర్యావరణ, నీటి సంరక్షణపై అవగ్గాహన కల్పించాలి.**

**- రాష్ట్ర పర్యాటక ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్, వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్లు.**







కామారెడ్డి, అక్టోబరు 13(మనం న్యూస్): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అలాగే జిల్లాల్లో చేపట్టిన పర్యాటక అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో బతుకమ్మ వేడుకల ఏర్పాట్లు, పర్యాటక ప్రాజెక్టుల పురోగతిపై ఆమె సమీక్షించారు. కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి సమావేశంలో పాల్గొన్నారు.

**56 పర్యాటక ప్రాజెక్టులు గడువులోగా పూర్తి చేయాలి**

బతుకమ్మ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించడంతోపాటు, వాటికి సంబంధించిన చిత్రాలు, దృశ్యాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని వాణీ ప్రసాద్ సూచించారు. బతుకమ్మ పాటల ద్వారా సూపర్ ఎల్నినో ప్రభావాలు, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలకు మంజూరైన 56 పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టులకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికల (డీపీఆర్) తయారీ బాధ్యతలను రెండు వారాల్లోగా అప్పగించాలని సూచించారు.

**హరిత హోటళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి**

పాక్షికంగా పూర్తయిన హరిత హోటళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో పెట్టుబడులను ప్రోత్సహించాలని తెలిపారు. ప్రతి జిల్లాలో పర్యాటక అవకాశాలను గుర్తించి, మౌలిక సదుపాయాల కల్పన, నిధుల సమీకరణ, పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా యువజన, క్రీడల శాఖ, పర్యాటక శాఖ అధికారి రంగ వెంకటేశ్వర్ గౌడ్తోపాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు-2026..

## మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలు, నృత్యాలతో మార్మోగిన జుక్కల్!

బిచ్కుంద అక్టోబర్ 13, మనం న్యూస్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమైన బతుకమ్మ పండుగ జుక్కల్ నియోజకవర్గంలో అంగరంగ వైభవంగా జరిగింది. జుక్కల్ మండల కేంద్రంలోని గుండూరు రోడ్డులో మంగళవారం నిర్వహించిన ఎల్ కె ఆర్ బతుకమ్మ సంబరాలు-2026 మహిళల సందడి, బతుకమ్మ పాటలు, సంప్రదాయ నృత్యాలు, ఉత్సాహభరిత వాతావరణం మధ్య ఘన విజయాన్ని సాధించాయి.

జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవానికి జుక్కల్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పార్టీలకు అతీతంగా నిర్వహించిన ఈ వేడుకలు తెలంగాణ సంస్కృతి పట్ల ప్రజలకున్న అభిమానాన్ని చాటిచెప్పాయి.

**బతుకమ్మలతో జనసంద్రంగా మారిన జుక్కల్!**

తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా జుక్కల్ మండల కేంద్రం పండుగ శోభను సంతరించుకుంది. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు, సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు, బతుకమ్మ పాటలకు అనుగుణంగా సాగిన నృత్యాలతో వేడుకల ప్రాంగణం కళకళలాడింది.

మహిళలు బతుకమ్మల చుట్టూ వలయాకారంగా చేరి పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ,



ఆనందోత్సాహాలతో నృత్యాలు చేయడంతో ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది. మహిళల భారీ భాగస్వామ్యంతో జుక్కల్ బతుకమ్మ సంబరాలు ప్రజల ఐక్యతకు, తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచాయి.

**ఆడపడుచులతో కలిసి బతుకమ్మ ఆడిన తోట అర్చన ..**

జుక్కల్ నియోజకవర్గ ఆడపడుచులతో ఆత్మీయంగా మమేకమైన ఆమె, మహిళలతో కలిసి స్వయంగా బతుకమ్మను పేర్చి, బతుకమ్మ పాటలు పాడుతూ, వారితో కలిసి సంప్రదాయ నృత్యాలు చేశారు.

ఎలాంటి ఆడంబరాలకు తావులేకుండా మహిళలతో కలిసిపోయి బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొనడం కార్యక్రమానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. ఆమె భాగస్వామ్యంతో బతుకమ్మ సంబరాలు మరింత సందడిగా మారాయి.



**తెలంగాణ సంస్కృతి పరిరక్షణకు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ప్రాధాన్యం!**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే సంకల్పంతో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ఈ బతుకమ్మ మహోత్సవానికి ప్రాధాన్యం ఇచ్చారు.

రాజకీయాలకు అతీతంగా ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి, తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయ పండుగను ఘనంగా నిర్వహించడం విశేషంగా నిలిచింది.

బతుకమ్మ కేవలం పండుగ మాత్రమే కాదని, తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు, మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అనే సందేశాన్ని ఈ వేడుకలు చాటిచెప్పాయి.

కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు తో కలిసి ఈ బతుకమ్మ మహోత్సవ నిర్వహణలో భాగస్వాములయ్యారు.

నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. రాజకీయ భేదాలకు అతీతంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం ప్రజలను ఒకచోట చేర్చిన వేడుకగా ఈ మహోత్సవం నిలిచింది.

**భారీ ప్రజా భాగస్వామ్యంతో విజయవంతమైన ఔఓఖ బతుకమ్మ సంబరాలు-2026!**

పార్టీలకు అతీతంగా ఐక్యతను చాటుతూ, తెలంగాణ సంస్కృతికి పెద్దపీట వేస్తూ, జుక్కల్ ఆడపడుచుల ఆనందోత్సాహాల మధ్య జరిగిన ఔఓఖ బతుకమ్మ సంబరాలు-2026 ఘన విజయంతో ముగిశాయి.

జుక్కల్ గడ్డపై బతుకమ్మ పూల పరిమళం.. ఆడపడుచుల ఆటపాటలతో అంబరాన్నంటిన సంబరం.. ప్రజల ఐక్యతతో చరిత్రాత్మకంగా నిలిచిన సాంస్కృతిక మహోత్సవం!



# సీఎం రేవంత్ రెడ్డితో నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ నేతల భేటీ

**జిల్లా రాజకీయాలు, పార్టీ బలోపేతంపై చర్చ**

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 13 (మనం న్యూస్): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు మంగళవారం ఢిల్లీలో భేటీ అయ్యారు. ఢిల్లీలోని ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్తో కలిసి జిల్లా నాయకులు ముఖ్యమంత్రిని కలిశారు.

సోమవారం ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో నిర్వహించిన మహా నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు, పార్టీ నాయకులు ఢిల్లీకి వెళ్లారు. ఈ నేపథ్యంలో మంగళవారం నిజామాబాద్ జిల్లా నాయకులు ముఖ్యమంత్రితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

ఈ భేటీలో నిజామాబాద్ జిల్లా రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీ బలోపేతం, జిల్లాలో పార్టీ కార్యకలాపాల విస్తరణ, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరువ చేయడం తదితర అంశాలపై చర్చించినట్లు తెలిసింది. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులంతా సమన్వయంతో పనిచేయాల్సిన అంశాలపై కూడా చర్చించినట్లు సమాచారం.

ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అరికెల నర్సారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాట్పల్లి నగేష్ రెడ్డి, బాల్కొండ ముత్యాల సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిరికొండ పోలీస్ స్టేషన్ను తనిఖీ చేసిన నూతన సీఐ ఎస్. రామన్










## శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

## రోడ్లపై ధాన్యం ఆరబెడితే కేసులు నమోదు చేస్తాం: సీఐ హెచ్చరిక

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 13 (మనం న్యూస్): ధర్పల్లి సర్కిల్ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన ఎస్. రామన్ సిరికొండ పోలీస్ స్టేషన్ను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లోని రికార్డులు, కేసుల వివరాలు, సిబ్బంది విధులు, శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించిన అంశాలను పరిశీలించి, పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అనంతరం సీఐ ఎస్. రామన్ మాట్లాడుతూ మండల ప్రజలకు దేవి నవరాత్రి, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ దేవి నవరాత్రి ఉత్సవాలు, విజయదశమి వేడుకలను శాంతియుత వాతావరణంలో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా పోలీసులకు సహకరించాలని తెలిపారు.

### రోడ్లపై ధాన్యం ఆరబెడితే చర్యలు తప్పవు

రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టడం, రోడ్లపై ధాన్యం కుప్పలు పోయడం వల్ల వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవడమే కాకుండా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని సీఐ ఎస్. రామన్ హెచ్చరించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని రహదారులపై ధాన్యం ఆరబెట్టడం, వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించేలా ధాన్యం కుప్పలు వేయడం మానుకోవాలని సూచించారు.

రోడ్లపై ధాన్యం పోసి వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తూ ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. రైతులు తమ ధాన్యాన్ని రోడ్లపై కాకుండా వాహనాల రాకపోకలకు ఆటంకం కలగని సురక్షిత ప్రదేశాల్లో ఆరబెట్టుకోవాలని సూచించారు.

### శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి




పండుగల సమయంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు. ప్రజలకు రక్షణ కల్పించడంలో పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటారని తెలిపారు. పండుగలను ప్రశాంతంగా జరుపుకోవడంతో పాటు రహదారి భద్రత విషయంలోనూ ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

ఈ తనిఖీలో సిరికొండ ఎస్సై జె. రామకృష్ణతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బాధితులకు సత్వర న్యాయం అందించాలి: ఎస్పీ

- కేసుల దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి.
- ఎఫ్ఐఆర్ నుంచి చార్జ్‌షీట్ వరకు తప్పులకు తావివ్వొద్దు.
- పోలీస్ సిబ్బందికి ఎస్పీ రాజేష్ చంద్ర దిశానిర్దేశం.




కామారెడ్డి, అక్టోబరు 13(మనం న్యూస్): కేసుల దర్యాప్తులో నాణ్యత, ఖచ్చితత్వానికి ప్రాధాన్యమివ్వాలని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర సూచించారు. బాధితులకు సత్వర న్యాయం అందించేలా ప్రతి పోలీసు సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. కేసుల నమోదు నుంచి దర్యాప్తు పూర్తిచేసి న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేసే వరకు ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని స్పష్టం చేశారు.

### రైటర్లకు కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియపై శిక్షణ

కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని పోలీస్స్టేషన్లు, సీఐ, డీఎస్పీ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న రైటర్లకు కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిబ్బందితో స్వయంగా మాట్లాడి, శిక్షణలో నేర్చుకున్న అంశాలు, కేసుల నమోదు, దర్యాప్తు విధానాలపై వారికి ఉన్న అవగాహనను అడిగి తెలుసుకున్నారు. శిక్షణలో పొందిన జ్ఞానాన్ని విధి నిర్వహణలో ఆచరణలో పెట్టాలని సూచించారు.

### ప్రతి దశలో అప్రమత్తత అవసరం

ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటి నుంచి చార్జ్‌షీట్ దాఖలు చేసే వరకు కేసుకు సంబంధించిన వివరాలను సమగ్రంగా, స్పష్టంగా నమోదు చేయాలని ఎస్పీ ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా రికార్డుల నిర్వహణ చేపట్టాలని సూచించారు. సాక్షులు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను వాస్తవాల ఆధారంగా నమోదు చేయాలని తెలిపారు. సాక్ష్యాధారాల సేకరణ, భద్రపరచడం, కేసు వివరాలను నమోదు చేయడంలో ప్రతి దశలో అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.



### సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి

ఆధునిక పోలీసింగ్లో అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. దర్యాప్తు ప్రక్రియలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, కేసులకు సంబంధించిన సమాచారాన్ని సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంపొందించేలా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, జిల్లాలోని పోలీస్స్టేషన్లు, సీఐ, డీఎస్పీ కార్యాలయాల రైటర్లు పాల్గొన్నారు.



# మాధాపూర్లో భూభారతి రీ-సర్వే పనుల పరిశీలన

### సర్వే ప్రక్రియ పురోగతిని సమీక్షించిన ఆర్మూర్ సబ్ కలెక్టర్





నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 13 (మనం న్యూస్): నిజామాబాద్ జిల్లా జక్రాన్పల్లి మండలంలోని మాధాపూర్ గ్రామాన్ని ఆర్మూర్ సబ్ కలెక్టర్ సందర్శించారు. గ్రామంలో భూభారతి పథకంలో భాగంగా చేపడుతున్న రీ-సర్వే (అనుభవ సర్వే) ప్రక్రియ పురోగతిని సమీక్షించారు.

ఈ సందర్భంగా సర్వే పనులు ఏ మేరకు పూర్తయ్యాయి, ప్రక్రియలో సాధించిన పురోగతి తదితర అంశాలను పరిశీలించారు. భూభారతి రీ-సర్వేకు సంబంధించిన పనుల స్థితిగతులను క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ఈ పర్యటనలో సబ్ కలెక్టర్ సర్వే ప్రక్రియ పురోగతిపై వివరాలు పరిశీలించారు. సబ్ కలెక్టర్ వెంట జక్రాన్ పల్లి తహసిల్దార్ కిరణ్ మహి, సిబ్బంది ఉన్నారు.

# భిక్కనూరులో గర్భిణులకు అమ్మఒడి కార్యక్రమం

**గర్భిణులకు వైద్య పరీక్షలు.. రక్తహీనత నివారణపై అవగాహన**

భిక్కనూరు, అక్టోబర్ 13 ( మనం న్యూస్ ): భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు డాక్టర్ యమీమా ఆధ్వర్యంలో మంగళవారం అమ్మఒడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దమల్లారెడ్డి, ఇస్సన్నపల్లి గ్రామాలకు చెందిన గర్భిణులను ఆశా కార్యకర్తలు 102 వాహనం ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా గర్భిణులకు రక్త పరీక్షలు నిర్వహించడంతోపాటు ఎత్తు, బరువు, రక్తపోటును పరీక్షించారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులను గుర్తించి, వైద్యుల సూచనల మేరకు ఐరన్ ఇంజెక్షన్లు అందించడంతోపాటు పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరించారు. గర్భిణులు ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమతుల్య ఆహారం తీసుకోవడం, వైద్యుల పర్యవేక్షణలో ఉండటం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

అలాగే గర్భిణులకు సాధారణ ప్రసవం జరిగేందుకు దోహదపడే తగిన వ్యాయామాల గురించి వైద్యురాలు వివరించారు. గర్భధారణ సమయంలో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య నర్సు జానకి, ఆరోగ్య పర్యవేక్షకులు రాజమణి, సువర్ణ, ప్రయోగశాల సాంకేతిక నిపుణులు వనశ్రీ, మధ్యస్థాయి ఆరోగ్య ప్రదాత ప్రశాంత్, ఆరోగ్య సహాయకులు హేమలత, స్వరూప, యశోద తదితరులు పాల్గొన్నారు.



**మండలవ్యాప్తంగా దోమల నివారణ చర్యలు**

మరోవైపు, మండలంలోని వివిధ గ్రామాల్లో ఆశా కార్యకర్తలు పొడి దినం కార్యక్రమాలను నిర్వహించారు. దోమల వృద్ధిని అరికట్టేందుకు నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి శుభ్రపరచడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

# భిక్కనూర్ చౌరస్తాలో ఆగని ఎక్స్‌ప్రెస్ బస్సులు!

**ప్రయాణికుల రద్దీ కనిపిస్తేనే ముందుకు పరుగులు.. పండుగ వేళ ప్రజలకు తప్పని తిప్పలు**

**వరుసగా మూడు బస్సులు ఆగకపోవడంతో ప్రయాణికుల ఆగ్రహం.. సరిపడా బస్సులు నడపాలని డిమాండ్**

భిక్కనూర్, అక్టోబర్ 13 ( మనం న్యూస్ ): పండుగ వేళ సొంతూళ్లకు వెళ్లాలనే ఆనందం ఒకవైపు.. బస్సుల కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సిన దుస్థితి మరోవైపు! భిక్కనూర్ చౌరస్తాలో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణికులు అధిక సంఖ్యలో కనిపిస్తున్నప్పటికీ బస్సులు నిలపకుండా వెళ్లిపోతుండటంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారుతున్నాయి.

భిక్కనూర్ చౌరస్తాలో ప్రయాణికులు బస్సుల కోసం ఎదురుచూస్తుండగా దాదాపు మూడు ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగకుండా వెళ్లిపోయినట్లు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో బస్టాప్‌లో రద్దీ మరింత పెరిగి బస్సు ఎక్కేందుకు ప్రజలు నానా తిప్పలు పడాల్సి వస్తోంది. ముఖ్యంగా పండుగల సమయంలో పట్టణాలకు వెళ్లే వారు, కుటుంబాలతో ప్రయాణించేవారు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**ప్రయాణికులు ఉన్నా.. బస్సులు మాత్రం ఆగవా?**

ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాల్సిన ప్రజా రవాణా వ్యవస్థలో ఇలాంటి పరిస్థితులు ఎందుకు ఎదురవుతున్నాయనే ప్రశ్నలు



వెల్లువెత్తుతున్నాయి. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉందని బస్సులు ఆపకుండా వెళ్లిపోతే సామాన్య ప్రజలు ఎక్కడికి వెళ్లాలి? గంటల తరబడి నిరీక్షించినా బస్సు ఎక్కే అవకాశం లేకపోతే వారి ప్రయాణం ఎలా సాగాలి? అనే ప్రశ్నలు ప్రయాణికుల నుంచి వినిపిస్తున్నాయి.

పండుగల సమయంలో ప్రయాణికుల సంఖ్య పెరుగుతుందని తెలిసినా అందుకు అనుగుణంగా అదనపు బస్సులు ఏర్పాటు చేయకపోవడం రవాణా శాఖ ప్రణాళికలోపాన్ని ఎత్తిచూపుతోంది. సాధారణ రోజుల్లోనే ఇబ్బందులు ఎదురవుతుంటే, పండుగ వేళ పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని ప్రయాణికులు వాపోతున్నారు.

**అధికారులు స్పందించేది ఎప్పుడు?**

భిక్కనూర్ చౌరస్తాలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎక్స్‌ప్రెస్ బస్సులు తప్పనిసరిగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పండుగల సమయంలో అదనపు బస్సులను నడపడంతోపాటు రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రయాణికులను గంటల తరబడి రోడ్లపైనే నిరీక్షించేలా చేసే పరిస్థితికి ముగింపు పలకాలని కోరుతున్నారు.

ప్రజలకు అవసరమైన సమయంలో బస్సులు అందుబాటులో లేకపోతే ప్రజా రవాణా ప్రయోజనం ఏమిటి? ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలి. బస్సులు ఆగని సమస్యకు పరిష్కారం చూపి, పండుగ వేళ ప్రజల ప్రయాణ కష్టాలను తొలగించాల్సిన బాధ్యత రవాణా శాఖపై ఉంది.

# సమాచార కమిషన్‌కు రెండో అప్పీల్





బోధన్ అక్టోబర్ 13 ( మనం న్యూస్): సమాచార హక్కు చట్టం ధరకాస్తు కు అసంతృప్తి తప్పుడు సమాచారం పంపిన పౌర సమాచార అధికారి పై తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ కు రెండో అప్పీల్ చేసిన సహా చట్టం కార్యకర్త వివరాల్లోకి వెళితే నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం మద్దేపల్లి గ్రామం కు చెందిన సహా చట్టం కార్యకర్త కేతవత్ రమేష్ నవీపేట్ మండలం తహసిల్దార్ కార్యాలయం కు సమాచార హక్కు చట్టం కింద ధరకాస్తు చేసుకున్నాడు దరఖాస్తులో నవీపేట్ మండలం తహసిల్దార్ కార్యాలయం కు సంబంధించిన పది ఏడు అంశాల ఫోర్ వన్ బి ప్రతి ఇవ్వాలని కార్యాలయం లో రోజు వారి నిర్వహించే రికార్డులు రిజిస్టర్ ల పేర్లు ఇవ్వాలని కోరినాడు మరియు తన తండ్రి బాబు యొక్క కొత్త పట్ట పాస్ బుక్ ఎందుకు రావడం లేదో కారణం తెలుపాలని తన కుటుంబం కు సంబంధించిన వ్యవసాయ భూమి కి సంబంధించిన సర్వే వివరాలు తెలుపాలని కోరినాడు తహసిల్దార్ కార్యాలయం పౌర సమాచార అధికారి తనకు తప్పుడు అసంతృప్తి సమాచారం పంపడంతో నిజామాబాద్ జిల్లా ఆర్ డి ఓ కు మొదటి అప్పీల్ చేసుకున్నాడు దరఖాస్తులను పరిశీలించిన ఆర్ డి ఓ నవీపేట్ మండలం తహసిల్దార్ కార్యాలయం పి ఐ వో కు తనకు విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు విచారణకు పి ఐ వో గైర్హాజరు అయ్యారు అని ఆర్ డి ఓ నవీపేట్ మండలం తహసిల్దార్ పి ఐ వో కు ఫోన్ చేసి ధరకాస్తు దారునికి పది హెను రోజుల లోపు సమాచారం ఇవ్వాలని చెప్పినా సమాచారం ఇవ్వకపోవడం తో కమిషన్ కు రెండో అప్పీల్ చేసుకున్నట్లు రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు

# పోలీసు అమరవీరుల సంస్మరణకు ప్రత్యేక కార్యక్రమాలు

- అక్టోబర్ 21 నుంచి 31 వరకు పోలీస్ ఫ్లాగ్ డే: జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర.
- విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు, లఘుచిత్రాలు, ఛాయాచిత్రాల పోటీలకు ఆహ్వానం.
- రక్తదాన శిబిరాలు, అవగాహన ర్యాలీలు.

అక్టోబర్ 24లోగా ఎంట్రీలు సమర్పించాలి.



కామారెడ్డి, అక్టోబరు 13(మనం న్యూస్): దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు జిల్లాలో పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర తెలిపారు. ఇందులో భాగంగా అక్టోబర్ 21న జిల్లా పోలీసు కార్యాలయంలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించనున్నారు.

## ₹వివిధ కార్యక్రమాలు₹

అమరవీరుల సేవలను ప్రజలకు తెలియజేయడంతో పాటు విద్యార్థులు, యువతలో పోలీసు విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు రక్తదాన శిబిరాలు, అవగాహన ర్యాలీలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు, ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. అమరవీరుల కుటుంబాలను పరామర్శించనున్నారు. పోలీసుల సేవలను వివరిస్తూ కళాబృందాల ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు.

## విద్యార్థులకు పోటీలు

విద్యార్థులు తెలుగు, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో వ్యాసరచన పోటీల్లో పాల్గొనవచ్చు. సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల నియంత్రణ, సామాజిక మాధ్యమాల దుర్వినియోగం, ప్రజాసేవలో పోలీసుల పాత్ర తదితర అంశాలపై వ్యాసాలు రాయాలి. ఒక్కో వ్యాసం 500 పదాలకు మించకూడదు. ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురికి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు.

## లఘుచిత్రాలు, ఫొటోల పోటీ

పోలీసుల ప్రజాసేవలు, రహదారి భద్రత, సైబర్ నేరాల నివారణ, ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసుల సహాయక చర్యలపై లఘుచిత్రాలు, ఛాయాచిత్రాలు రూపొందించవచ్చు. లఘుచిత్రం మూడు నిమిషాలకు మించకూడదు. ఒక్కొక్కరు మూడు ఛాయాచిత్రాలు సమర్పించాలి.

## ఐటీ కోర్ విభాగంలో ఎంట్రీలు అందజేయాలి

ఆసక్తి ఉన్నవారు ఈ నెల 24లోగా జిల్లా పోలీసు కార్యాలయంలోని ఐటీ కోర్ విభాగంలో రవికుమార్కు ఎంట్రీలు అందజేయాలని ఎస్పీ సూచించారు. వివరాలకు 9963308978, 8712526113 నంబర్లను సంప్రదించవచ్చు.

పోలీసు అమరవీరుల త్యాగాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని, ప్రజల భద్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

---



# ఆర్మూర్ కోర్టు ప్రాంగణంలో మెగా ఉచిత వైద్య శిబిరం

**సుమారు 200 మందికి వైద్య పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ**

ఆర్మూర్, అక్టోబర్ 13 (మనం న్యూస్): ఆర్మూర్ న్యాయస్థాన సముదాయంలో మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ, నిజామాబాద్ మెడికవర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి పి. శ్రీదేవి ప్రారంభించారు. జూనియర్ సివిల్ జడ్జి నెల్లి సరళ రాణి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి. భవ్యశ్రీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి పి. శ్రీదేవి మాట్లాడుతూ న్యాయవాదులతోపాటు కోర్టు సిబ్బంది, ఇతర ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను మెడికవర్ ఆసుపత్రి ద్వారా అందించినట్లు తెలిపారు. ప్రజలు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.శిబిరంలో మెడికవర్ ఆసుపత్రికి చెందిన జనరల్ ఫిజీషియన్ డాక్టర్ మాలు ఆనంద్ నందకిషోర్, కార్డియాలజిస్ట్ డాక్టర్ జగదీష్ చంద్రబోస్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మణిదీప్ రెడ్డి, గైనకాలజిస్ట్ డాక్టర్ శరణ్య పాల్గొని వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య సలహాలు అందించారు.సుమారు 200 మంది ఈ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. బీపీ, ఈసీజీ, 2డీ ఎకో తదితర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తగిన వైద్య సూచనలు చేశారు. గుండె సంబంధిత సమస్యలు, ఎముకలు, కీళ్ల సమస్యలు, మహిళల ఆరోగ్య సమస్యలపై వైద్యులు అవగాహన కల్పించారు.ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అనారోగ్య లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# మోపాల్ పోలీస్ స్టేషన్ను తనిఖీ చేసిన ఏసీపీ బి. ప్రకాష్

**పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి**



నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 13 (మనం న్యూస్): నిజామాబాద్ డివిజన్ ఏసీపీ బి. ప్రకాష్ మంగళవారం మోపాల్ పోలీస్ స్టేషన్ను సందర్శించి, స్టేషన్లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, రిజిస్టర్లు, పెండింగ్ కేసులు, దర్యాప్తుల పురోగతి, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ నిర్వహణ, కేసుల దర్యాప్తు, కోర్టు సంబంధిత రికార్డులు, వారెంట్ల అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేయాలని, పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. నేరాల నియంత్రణకు నిరంతరం కృషి చేయాలని, నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కోర్టుల నుంచి జారీ అయ్యే నాన్ బెయిలబుల్ వారెంట్లను త్వరితగతిన అమలు చేయాలని స్పష్టం చేశారు.

పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను ఓపికగా విని చట్టపరిధిలో తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు, బాధితుల ఫిర్యాదుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందిస్తూ పోలీస్ శాఖపై నమ్మకాన్ని పెంపొందించాలని సూచించారు. గ్రామాల్లో భూ తగాదాలు, ఇతర వివాదాలను ముందుగానే గుర్తించి, అవసరమైన కౌన్సెలింగ్ నిర్వహిస్తూ అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.



అలాగే, పోలీస్ స్టేషన్లోని రికార్డులను క్రమబద్ధంగా నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు నవీకరించాలని, కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఆధారాల సేకరణకు ప్రాధాన్యతనిస్తూ ఈ-సాక్ష్య విధానాన్ని నిబంధనల ప్రకారం అమలు చేయాలని, దర్యాప్తుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

పోలీస్ సిబ్బంది క్రమశిక్షణ, సమయపాలనతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, నేరాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఏసీపీ దిశానిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో నిజామాబాద్ సౌత్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. బిక్షపతి, మోపాల్ ఎస్ఐ జెడ్. సుస్మిత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





# అన్నపూర్ణ దేవిగా అమ్మవారి అలంకరణ

**- వైదనాథ్ కాలనీలో సింహాసనేశ్వరి ఘనంగా దుర్గ ఉత్సవాలు.**

**- కుంకుమ పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్.**

కామారెడ్డి, అక్టోబరు 13(మనం న్యూస్): కామారెడ్డి పట్టణ కేంద్రంలోని వైదనాథ్ కాలనీలో సింహాసనేశ్వరి దుర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు అమ్మవారిని అన్నపూర్ణ దేవి అవతారంలో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కాలనీవాసులు అంగరంగ వైభవంగా కుంకుమ పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ఈ పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో సుజని, సునీత, కావ్య, రజిత, శ్రేయ, విజయ, ఉమ, సరిత, వనిత, దేవక్కతో పాటు కాలనీవాసులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# అన్నపూర్ణ దేవిగా అమ్మవారి అలంకరణ

**టీచర్ కాలనీలో ఘనంగా తమ ఉత్సవాలు**



బిచ్కుంద అక్టోబర్ 13 మనం న్యూస్: కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలో ని టీచర్ కాలనీలో అన్నపూర్ణగా అమ్మవారి అలంకరణ సార్వజనిక్ దుర్గామాత ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నడుస్తున్న దేవీ నవరాత్రాలు ఉత్సవాల సందర్భంగా మంగళవారం రోజు అన్నపూర్ణ అలంకరణని చేశారు .ఉదయం పూజా పునస్కారాలు, కుమార్చన అనంతరం రాత్రి జోగువ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహారాష్ట్ర సరిహద్దులలో ఉండడం వలన జోగువా కార్యక్రమాన్ని అమ్మవారి మండపాల వద్ద ఘనంగా జరుపుతారు.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శుక్రవారం ఆదివారం అష్టమి రోజు ఈజోగువా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటారు.

# అర్గుల్ ఎస్బీఐ బ్యాంక్, ఏటీఎంలో పోలీసుల భద్రతా తనిఖీలు

**సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సీఐ కె. వినోద్**



నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 13 (మనం న్యూస్): నిజామాబాద్ జిల్లా జక్రాన్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అర్గుల్ గ్రామంలోని ఎస్బీఐ బ్యాంక్, ఏటీఎంలో డిచ్పల్లి సీఐ కె. వినోద్, జక్రాన్పల్లి ఎస్ఐ జి. మహేష్ భద్రతా తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బ్యాంక్, ఏటీఎంలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు, అలారం వ్యవస్థ, అత్యవసర సమయాల్లో అధికారులకు సమాచారం అందించే అలర్ట్ వ్యవస్థతో పాటు ఇతర భద్రతా ఏర్పాట్లను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు, ప్రజల భద్రతకు అవసరమైన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

**సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి**

అనంతరం సీఐ కె. వినోద్ మాట్లాడుతూ, ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు ఫోన్ కాల్స్, నకిలీ లింకులు, తప్పుడు పెట్టుబడి పథకాలు, ఓటీపీ వివరాల సేకరణ వంటి పద్ధతులతో ప్రజలను మోసం చేస్తున్నారని వివరించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్లైన్లో వచ్చే ప్రతి సమాచారాన్ని నమ్మకుండా, దాని నిజానిజాలను నిర్ధారించుకున్న తర్వాతే స్పందించాలని తెలిపారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, ఏటీఎం పిన్ వంటి రహస్య సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు వెల్లడించవద్దని హెచ్చరించారు.

సైబర్ మోసానికి గురైనట్లయితే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్లైన్కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

బ్యాంకింగ్ లావాదేవీల్లో అప్రమత్తత, భద్రతా నిబంధనల పాటింపు, సైబర్ నేరాలపై అవగాహనతోనే మోసాలను అరికట్టవచ్చని పోలీసులు పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

# 2వ వార్డులో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**- ఎస్డీఎఫ్ నిధులతో రహదారి నిర్మాణపనులు ప్రారంభించిన చైర్పర్సన్ ఉమారాణి శ్రీనివాస్.**

**- అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం.**



**ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు**

కామారెడ్డి, అక్టోబరు 13(మనం న్యూస్): కామారెడ్డి పట్టణ కేంద్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నట్లు మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ తెలిపారు. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో ఎస్డీఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదురుకాకుండా రహదారి సౌకర్యాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వార్డుల వారీగా స్థానిక అవసరాలను గుర్తించి, ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు.

మున్సిపాలిటీ పరిధిలోని ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు చేపడతామని ఆమె పేర్కొన్నారు. రహదారుల అభివృద్ధితో స్థానికులకు రాకపోకల్లో సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మోతిలాల్, డీఈ హన్మంత్రావు, టీపీఓ వినీత్, గూడెం శ్రీనివాస్రెడ్డి, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# సాంకేతిక బిడ్లను పరిశీలించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**- సంక్షేమ వసతి గృహాలకు గుడ్ల సరఫరా, టెండర్ల పరిశీలన పూర్తి.**

**- అర్హతలు, ధ్రువపత్రాల తనిఖీ, ప్రభుత్వ నిబంధనల మేరకు తదుపరి ప్రక్రియ.**



కామారెడ్డి, అక్టోబరు 13(మనం న్యూస్): జిల్లాలోని సంక్షేమ, గురుకుల వసతి గృహాలకు గుడ్ల సరఫరా కోసం నిర్వహించిన టెండర్ల సాంకేతిక బిడ్ల పరిశీలన మంగళవారం పూర్తయింది. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధ్యక్షతన జరిగిన ఈ ప్రక్రియలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. టెండర్లలో పాల్గొన్న సంస్థలు సమర్పించిన బిడ్లు, ధ్రువపత్రాలను నిర్దేశిత అర్హతలు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం కమిటీ పరిశీలించింది. తదుపరి ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చేపడతామని అధికారులు తెలిపారు. గుడ్ల సరఫరా టెండర్లను పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

# కలెక్టరేట్ వద్ద ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన

**జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల ధర్నా, రెగ్యులరైజేషన్కు డిమాండ్.**

**- 2022 నుంచి పెండింగ్లో ఉన్న ఇంక్రిమెంట్లు, బోనస్ చెల్లించాలని డిమాండ్.**

**- కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి.**







కామారెడ్డి, అక్టోబరు 13(మనం న్యూస్): జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్హెచ్ఎం) పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు తమ సేవలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన బాట పట్టారు. ఎన్హెచ్ఎం జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో మంగళవారం కామారెడ్డి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. వైద్యులు మొదలుకొని కాంటింజెంట్ సిబ్బంది వరకు వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు ఇందులో పాల్గొన్నారు.

### పెండింగ్ బకాయిలు చెల్లించాలి₹

2022 నుంచి పెండింగ్లో ఉన్న 5 శాతం వార్షిక ఇంక్రిమెంట్, 8 శాతం లాయల్టీ బోనస్ను వెంటనే చెల్లించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న తమ సేవలను క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### ₹శాశ్వత పరిష్కారం చూపాలి₹

వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఇతర విభాగాల ఉద్యోగులతో పాటు కాంటింజెంట్ సిబ్బందికి న్యాయం చేయాలని జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17 వేల మంది ఎన్హెచ్ఎం ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించి, పెండింగ్ బకాయిలను చెల్లించడంతోపాటు ఉద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ ధర్నాలో జిల్లా అధ్యక్షుడు టి. సుమన్, పి. వెంకటరమణ, బి. పద్మజ, డాక్టర్. పి. హరీష్, డాక్టర్ సంతోష్, డాక్టర్ వి. రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



# వికలాంగులకు అండగా నిలుస్తున్న పోచారం భాస్కర్ రెడ్డి

రుద్రూర్, అక్టోబర్ 13 (మనం న్యూస్) : మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి కామారెడ్డి జిల్లా, బాన్సువాడ నియోజకవర్గంలో గల దివ్యాంగులు (వికలాంగుల) కు మానవతా దృక్పథంతో కృత్రిమ అవయవాలు అందజేస్తూ వారికి అండగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగా రుద్రూర్ మండల కేంద్రంతో పాటు చుట్టు పక్క గ్రామాలల్లో మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు దివ్యాంగుల కోసం ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పించారు. 10 మంది దివ్యాంగుల వివరాలు సేకరించామని, వీరి వివరాలను పోచారం భాస్కర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి వీరికి ఉచితంగా కృత్రిమ అవయవాలను అందజేయనున్నట్లు మాజీ సొసైటీ చైర్మన్ పత్తి రాము తెలిపారు. ఎవరైనా దివ్యాంగులు ఉంటే తమకు తెలుపాలని వారికి పోచారం భాస్కర్ అన్న సహాయంతో ఉచితంగా కృత్రిమ అవయవాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తోట అరుణ్ కుమార్, మాజీ జడ్పిటిసి నారోజి గంగారం, నాయకులు తోట సంగయ్య, అక్కపల్లి నాగేందర్, తోట్ల గంగారం, వార్డు మెంబర్లు ఇమ్రాన్, దుర్కి రవి, ఈర్వ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ కబడ్డీలో 'సరస్వతి' సత్తా!

**- అఖిల భారత పోటీల్లో కామారెడ్డి శ్రీ సరస్వతీ విద్యామందిర్ విద్యార్థుల ఘన విజయం.**

**- మధ్యప్రదేశ్లోని బేతుల్లో నిర్వహించిన అఖిల భారత కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానం.**



కామారెడ్డి, అక్టోబరు 13(మనం న్యూస్): మధ్యప్రదేశ్ రాష్ట్రం బేతుల్లో నిర్వహిస్తున్న అఖిల భారత స్థాయి కబడ్డీ పోటీల్లో కామారెడ్డి శ్రీ సరస్వతీ విద్యామందిర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. దక్షిణ మధ్య క్షేత్రం జట్టు తరఫున ఆడిన విద్యార్థులు ఉత్తరప్రదేశ్ జట్టును ఓడించి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. క్రీడాకారులు ప్రదర్శించిన పట్టుదల, క్రమశిక్షణ, జట్టుస్ఫూర్తి విజయానికి దోహదపడ్డాయి.

### అభినందించిన పాఠశాల యాజమాన్యం

జాతీయ స్థాయిలో పాఠశాల కీర్తిపతాకను ఎగురవేసిన విద్యార్థులను పాఠశాల ప్రబంధకారిణి కమిటీ సభ్యులు, ప్రధానాచార్యులు, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తూ వారి సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేస్తున్నామని పాఠశాల ప్రతినిధులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే





మద్నూర్ :(అక్టోబర్ -13) మనం -న్యూస్ :జుక్కల్ నియోజకవర్గం, మద్నూర్ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ప్రతిష్టాత్మక ఇంటిగ్రేటెడ్ స్కూల్ (సమీకృత పాఠశాల) భవన నిర్మాణ పనులను బిఆర్ఎస్ పార్టీ జుక్కల్ నియోజకవర్గ నాయకులు, మాజీ శాసనసభ్యులు హన్మంత్ షిండే మద్నూర్ మండల నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా నిర్మాణ నాణ్యతపై హన్మంత్ షిండే కాంట్రాక్టర్లకు, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ముఖ్యంగా ప్రస్తుతం 'ఎల్ నినో' ప్రభావం వల్ల ఆశించిన స్థాయిలో వర్షాలు లేవని, వాతావరణం పొడిగా ఉన్నందున భవన నిర్మాణంలో క్యూరింగ్ ప్రక్రియను అత్యంత నిశితంగా, నిరంతరం నిర్వహించాలని సూచించారు.సరైన క్యూరింగ్ ఉంటేనే భవనం పటిష్టంగా ఉంటుందని పేర్కొంటూ, పనుల్లో ఎలాంటి అలసత్వం వహించకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు.



# దుర్గామాత మండపం వద్ద అన్నదానం

రుద్రూర్, అక్టోబర్ 13 (మనం న్యూస్) : రుద్రూర్ గ్రామంలోని దుర్గాదేవి మండపం వద్ద తొమ్మిది రోజులపాటు అమ్మవారిని రోజుకో అవతారంలో అలంకరిస్తూ అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహిస్తూ ఉత్సవాలను ఘనంగా జరుపుతున్నారు. మూడవరోజు మంగళవారం అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా రుద్రూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో చదివిన (1993-1994) 10వ తరగతి బ్యాచ్ ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పద్మ సాయినాథ్, కంచర్ల గగన్,చిలుక నర్సింలు, పార్వతి శేఖర్, కోటగిరి మురళి, వంజరి బాలాజీ, గుర్ల గోపి, ఎంబరి ఉమారాణి, బండారు కవిత, మంత్రి లక్ష్మణ్, గొల్ల శ్రీనివాస్, గాండ్ల శ్రీనివాస్, దుర్గామాత మాలధారణ స్వాములు, దుర్గామాత కమిటీ నిర్వాహకులు, సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

